నమస్తే తెలంగాణ

# కరీంనగర్

5 | కరీంనగర్, గురువారం 22 ఫిబ్రవరి 2024 | KARIMNAGAR




పెద్దూర్‌లో కుటుంబసభ్యులను ఆలింగనం చేసుకుంటున్న మల్లేశం, రవి

# రెండు దశాబ్దాల తర్వాత ఇంటికి..

- స్వగ్రామానికి దుబాయ్ జైలు బాధితులు
- ఫలించిన మంత్రి కేటీఆర్ 17 ఏండ్ల పోరాటం
- అనేక ప్రయత్నాలు.. పరిహారానికి సొంత డబ్బులు
- ఎట్టకేలకు ఇటీవలే కోర్టు క్షమాభిక్ష
- ఇప్పటికే ఇంటికొచ్చిన లక్ష్మణ్, హన్మంతు
- తాజాగా ఇల్లు చేరిన అన్నదమ్ములు శివరాత్రి మల్లేశం, రవి
- కుటుంబ సభ్యుల ఆనందం.. కన్నీటి పర్యంతం
- కేటీఆరే మా దేవుడంటూ కృతజ్ఞతగా గ్రామంలో ఫ్లెక్సీల ఏర్పాటు

**పద్దెనిమిదేండ్ల కన్నీటి కథ సుఖాంతమైంది. జైలు పాలై చెదిరిపోయిన బంధం మళ్లీ ఒక్కటైంది. అసలే ఎడారి దేశం.. భాష తెలియని ప్రాంతంలో చేయని నేరానికి కటకటాలపాలైన సిరిసిల్ల జిల్లాకు చెందిన నలుగురు, జగిత్యాల జిల్లాకు చెందిన ఒకరి విడుదల కోసం ఆ కుటుంబాలు పడ్డ నరకయాతన తీరింది. మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్ చేసిన పదిహేడేండ్ల అలుపెరుగని పోరాటం ఫలించి, ఇటీవలే దుబాయ్ కోర్టు క్షమాభిక్ష ప్రసాదించగా, ఆ కుటుంబాల్లో ఆనందం నిండింది. ఇటీవలే ఇద్దరు స్వగ్రామాలకు రాగా, తాజాగా బుధవారం సిరిసిల్ల అర్బన్ మండలం పెద్దూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు శివరాత్రి మల్లేశం, రవి ఇల్లు చేరారు. తమవారిని ఒకరికొకరు కండ్లారా చూసుకొని కన్నీటి పర్యంతమయ్యారు.**

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 21: కేటీఆర్ 2009లో సిరిసిల్ల ఎమ్మెల్యేగా గెలిచారు. అప్పుడు బాధిత కుటుంబసభ్యులు కలిసి గోడు వెళ్లబోసుకోవడంతో ఆయన చలించిపోయారు. అప్పటి నుంచే ఆ ఐదుగురిని జైలు నుంచి విడిపించేందుకు తన ప్రయత్నాలు మొదలు పెట్టారు. దుబాయ్ చట్టాల ప్రకారం.. హత్యకు గురైన వారి కుటుంబ సభ్యులకు పరిహారం చెల్లించడంతోపాటు బాధిత కుటుంబం క్షమాభిక్ష పెడితే కోర్టు విధించిన శిక్షను రద్దు చేస్తారు. ఈ క్రమంలో 2013లో కేటీఆరే స్వయంగా నేపాల్ వెళ్లి దిల్‌బహదూర్ భార్యకు ₹15 లక్షలు అందజేసి క్షమాభిక్షకు మార్గం సుగమం చేశారు. కానీ, మారిన చట్టాలతో కోర్టు క్షమాభిక్ష సాధ్యం కాలేదు. దీంతో కేటీఆర్ దుబాయ్‌కు వెళ్లి, అక్కడి ఎంబీసీ అధికారులతో చర్చించారు. మరో ₹15లక్షల దాకా లాయర్, ఇతర ఖర్చులు భరించారు. ఇలా పలు దఫాల ప్రయత్నాలతో దుబాయ్ కోర్టు ఇటీవలే ఐదుగురికీ క్షమాభిక్షకు ప్రసాదించింది. ఈ క్రమంలో ఒక్కొక్కరుగా విడుదలవుతూ స్వదేశానికి వస్తున్నారు. నెల కిందట కోనరావుపేటకు చెందిన దండుగుల లక్ష్మణ్ ఇంటికి రాగా, నాలుగు రోజుల క్రితమే మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు చేరుకున్నాడు. రెండ్రోజుల క్రితమే పెద్దూరుకు చెందిన అన్నదమ్ములు శివరాత్రి మల్లేశం, రవి విడుదలయ్యారు. మరో వ్యక్తి చందుర్తికి చెందిన నాంపల్లి వెంకటి విడుదల కావాల్సి ఉంది. అయితే మల్లేశం, రవి వద్ద టికెట్లకు డబ్బుల్లేక దుబాయ్‌లోనే ఆగిపోగా, విషయం తెలుసుకొని కేటీఆరే టికెట్లు సమకూర్చారు. దీంతో ఇద్దరూ బుధవారం తెల్లవారుజామున దుబాయ్ నుంచి స్వదేశానికి చేరుకున్నారు. అప్పటికే కేటీఆర్ ఆదేశాలతో బీఆర్‌ఎస్ నాయకులు కుటుంబసభ్యులను అక్కడికి తీసుకెళ్లి, ఆ ఇద్దరిని ఎయిర్‌పోర్టు తీసుకొచ్చారు. ఇంటికి చేరిన మల్లేశం, రవి తమ తల్లిదండ్రులు, కుటుంబసభ్యులను చూసి ఉద్వేగానికి లోనయ్యారు. కొడుకులు, కూతుర్లు, మనుమలను సైతం చూసి పలకరిస్తూ.. ఆలింగనం చేసుకున్నారు. ఇటు తల్లిదండ్రులు 'కొడుకులారా..? మిమ్మల్ని జన్మలో చూస్తామనుకోలేదు' అంటూ కంటతడిపెట్టారు. తమ కొడుకులు కేటీఆర్‌సారు దయతోనే ఇంటికి చేరారని, ఆ సారు సల్లంగా ఉండాలని కోరుకున్నారు. కేటీఆర్‌కు కృతజ్ఞతగా గ్రామంలో కుటుంబ సభ్యులు, బంధువులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.

### అసలేం జరిగింది?

కోనరావుపేట మండలం దండుగుల లక్ష్మణ్(48), చందుర్తి మండలం రుద్రంగికి చెందిన నాంపెల్లి వెంకటి (48), పెద్దూరు గ్రామానికి చెందిన అన్నదమ్ములు శివరాత్రి మల్లేశం (48), శివరాత్రి రవి(45), జగిత్యాల జిల్లా మానాలకు చెందిన శివరాత్రి హన్మంతు (51) 2004లో ఉపాధి కోసం దుబాయ్‌కు వెళ్లారు. అక్కడ పనిచేసే చోట వర్క్ ఎక్కువగా లేక కంపెనీ నుంచి బయటకు వచ్చారు. అడ్డమీది కూలీల్లా దొరికిన పనిచేస్తుండేవారు. ఈ క్రమంలో అక్కడ కంపెనీలో నేపాల్‌కు చెందిన దిల్‌బహదూర్ అనే సెక్యూరిటీ గార్డు 2005లో హత్యకు గురయ్యాడు. ఈ కేసులో వీరిని అక్కడి పోలీసులు అరెస్ట్ చేయగా, కోర్టు 25 ఏండ్ల జైలు శిక్ష విధించింది. అయితే తమ వారిని విడిపించాలని కుటుంబసభ్యులు అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వంలోని పాలకులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదు.



క్షమాభిక్ష పెట్టేలా దుబాయి రాజుకు విన్నవించాలని అక్కడి అధికారులను కలిసి కోరుతున్న ఎమ్మెల్యే కేటీఆర్ (ఫైల్)



'కేటీఆర్ మాదేవుడు' అంటూ పెద్దూర్‌లో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

## వృద్ధుల విహారయాత్ర




విహారయాత్రకు వెళ్తున్న వయోవృద్ధులు

సిరిసిల్ల రూరల్, ఫిబ్రవరి 21: సాధారణంగా పిల్లలు, యువకులు విహార యాత్రకు వెళ్తుంటారు. మధ్య వయస్కులు వెళ్లడం చూస్తుంటాం. కానీ వృద్ధులు వెళ్లడం మీరెప్పుడైనా చూశారా..? అవును తంగళ్లపల్లి మండలం మండెపల్లి శివారులోని ప్రభుత్వ వయోవృద్ధుల ఆశ్రమంలోని వృద్ధులు బుధవారం గంభీరావుపేట మండలం నర్మాలలోని ఎగువ మానేరు ప్రాంతానికి వెళ్లారు. కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశాలతో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం చొరవతో విహారయాత్రకు వెళ్లిన వృద్ధులు అక్కడే చాలా సేపు సరదాగా గడిపారు. వనభోజనాలు చేశారు. మానేరు డ్యాంను వీక్షించి, ఆటపాటలతో సరదాగా గడిపారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ మత, అసిస్టెంట్ కోఆర్డినేటర్ వెంకటేశ్, వృద్ధులు ఉన్నారు.

# పోస్టింగ్‌లు ఉంటయా.. ఊడుతయా..?

## అన్ని విభాగాల అధికారుల్లో గందరగోళం





- చర్చనీయాంశమవుతున్న ఇటీవలి బదిలీలు
- ఎన్నికల మాటున ఇష్టానుసారం పోస్టింగులు
- ఉత్తర్వులు ఇచ్చిన వారంలోనే మళ్లీ మార్పులు
- పోలీస్ పోస్టింగుల్లో అధికారపార్టీ రాజకీయ జోక్యం?
- భారీగా డబ్బులు చేతులు మారాయనే ఆరోపణలు

**ఇటీవలి బదిలీల్లో విచిత్ర పరిస్థితి కనిపిస్తున్నది. ట్రాన్స్‌ఫర్లు జరుగుతున్న తీరు అన్ని విభాగాల అధికారులను అయోమయానికి గురిచేస్తున్నది. పోలీస్ శాఖలో మరీ గందరగోళంగా ఉన్నది. ఉదయం ఉత్తర్వులు రావడం, జాయిన్ అవ్వడానికి ముందే రద్దు కావడం, ఆ స్థానంలో కొత్త వారికి పోస్టింగులు ఇవ్వడం, ఒక వేళ జాయిన్ అయినా వారంలోపే మళ్లీ బదిలీ కావడం జరుగుతున్నది. ఏ పోస్టు ఎప్పుడు ఉంటుందో..? ఊడుతుందో..? తెలియక ఆందోళన వ్యక్తమవుతున్నది. ప్రస్తుతం ఎన్నికల ట్రాన్స్‌ఫర్లు కొనసాగుతుండగా.. ఇదే సమయంలో రాజకీయ జోక్యం ఉంటున్నట్టు తెలుస్తున్నది. కొంత మంది అధికార పార్టీ నాయకులు భారీగా వసూళ్లకు పాల్పడుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. అందువల్లే మాటిమాటికి బదిలీ ఉత్తర్వులు మారుతున్నాయనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**

కరీంనగర్, ఫిబ్రవరి 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : ఉమ్మడి జిల్లాలో బదిలీలు చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యంగా పోలీస్ శాఖలో వణుకు పుట్టిస్తున్నాయి. పోస్టింగ్ ఉత్తర్వులు చేత పట్టుకొని, తట్టా బుట్ట సర్దుకొని జాయిన్ కావడానికి ప్రిపేర్ అయ్యేలోపే రద్దవుతున్నాయి. ఒకే వేళ జాయిన్ అయినా కొంత మందికి వారం తిరిగేలోపే ట్రాన్స్‌ఫర్ అవుతున్నాయి. ఇటీవలి కాలంలో జరిగిన అనేక పోస్టింగ్‌లు అందుకు ఉదాహరణగా నిలుస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లా డీఎస్పీగా పనిచేస్తున్న ఉమేందర్‌ను రామగుండం స్పెషల్ బ్రాంచ్ ఏసీపీగా ట్రాన్స్‌ఫర్ చేస్తూ తాజాగా ఉత్తర్వులు వచ్చాయి. ఆయన జాయిన్ అవడానికి ప్రిపేరవుతున్న సమయంలోనే.. సదరు ఉత్తర్వులను రద్దు చేస్తూ, ఆ స్థానంలో కొత్తగూడెం జిల్లా మణగూరులో పనిచేస్తున్న రాఘవేందర్‌రావుకు పోస్టింగ్ ఇచ్చారు. నిజానికి పై స్థాయి అధికారులకు కూడా ఈ బెడద తప్పలేదు. గతంలో రామగుండం కమిషనరేట్ సీపీగా పనిచేస్తున్న రెమా రాజేశ్వరిని మొదట బదిలీ చేసిన ప్రభుత్వం, ఆ స్థానంలో డీఎస్ చౌహాన్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన జాయిన్ కాకుండా కొంత మంది నాయకులే అడ్డుపడినట్టు తెలిసింది. అయితే ఆ స్థానంలో రెమా రాజేశ్వరియే కొన్నాళ్లపాటు కొనసాగారు. తర్వాత వరంగల్ సీపీ తరుణ్‌జోషికి అదనపు బాధ్యతలు అప్పగించారు. ఆ తర్వాత ఇటీవల వెలువడిన బదిలీల్లో ఎం శ్రీనివాసులును సీపీగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో ఆయన బాధ్యతలు స్వీకరించారు. అలాగే పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేశ్‌ను బదిలీ చేసి, ఆయన స్థానంలో శ్రీనివాస్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కానీ, మరుసటి రోజే ఆ స్థానంలో గజ్జి కృష్ణను నియమిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. ఇది పోలీస్‌శాఖలో చర్చనీయాంశమైంది. రామగుండం ట్రాఫిక్ సీఐగా పనిచేసిన ప్రవీణ్‌కుమార్‌ను పోలీస్ సీఐగా బదిలీచేశారు. ఆయన చేరేలోపే ఆయన స్థానంలో వీ రవి వచ్చారు. మూడు రోజులు కాకముందే జమ్మికుంట సీఐగా ఇతన్ని బదిలీ చేశారు. కాగా, తాజాగా ట్రాఫిక్ సీఐగా రాజేంద్ర ప్రసాద్‌కు పోస్టింగ్ ఇచ్చారు.

### జగిత్యాల జిల్లాలోనూ..

జగిత్యాల జిల్లాకు సంబంధించి పోలీస్ అధికారుల బదిలీల్లో రెండుమూడు మార్పులు చోటు చేసుకున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు రెండు నెలల ముందు కరీంనగర్ టౌన్ నుంచి జగిత్యాల టౌన్ సీఐగా నటేశ్ బదిలీపై వచ్చారు. కాగా, ఎన్నికల తర్వాత ఆయనను ఐజీ వరంగల్ కార్యాలయానికి అటాచ్ చేశారు. ఆదిలాబాద్‌లో సీఐగా పనిచేస్తున్న బుద్ది స్వామిని జగిత్యాల టౌన్ సీఐగా బదిలీ చేశారు. అయితే వారం వ్యవధిలోనే ఈ ఆర్డర్‌లో మార్పులు చేశారు. సీఐ నటేశ్ జగిత్యాల టౌన్‌లో రిలీవ్ కాలేదు. అదే సమయంలో బుద్ది స్వామి సైతం జగిత్యాల జిల్లాలో రిపోర్ట్ చేయలేదు. నటేశ్‌ను జగిత్యాల టౌన్ సీఐగా కొనసాగిస్తూ, బుద్ది స్వామిని రామగుండం కమిషనరేట్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. నటేశ్‌తోపాటే ధర్మపురి, మల్యాల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లను బదిలీ చేశారు. ధర్మపురిలో పనిచేస్తున్న రమణమూర్తిని ఐజీ కార్యాలయానికి అటాచ్ చేస్తూ.. సతీశ్‌కు సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే మల్యాలలో పనిచేస్తున్న సీఐ బిల్ల కోటేశ్వర్‌ను బదిలీ చేసి, జగిత్యాల స్పెషల్ బ్రాంచ్ సీఐ నాగేశ్వర్‌రావుకు పోస్టింగ్ ఇచ్చారు. అయితే ఈ రెండు పోస్టులను సైతం వారం రోజుల వ్యవధిలో మార్చి వేశారు. ధర్మపురిలో సతీశ్‌ను మార్చి, రామనర్సింహారెడ్డిని సీఐగా నియమించారు. ఇక మల్యాలకు బదిలీ చేసిన నాగేశ్వర్‌రావును తిరిగి జగిత్యాల హెడ్ క్వార్టర్‌కు, కరీంనగర్ కమిషనరేట్‌లో పనిచేస్తున్న సీఐ దామోదర్‌రెడ్డిని బదిలీ చేశారు. ఇలా జగిత్యాల సబ్ డివిజన్‌లోని ముగ్గురు సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసిన వారం వ్యవధిలోనే మళ్లీ వారిని బదిలీ చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఇక ఇటీవలే నిర్వహించిన ఎస్ఐ బదిలీల్లోనూ ఒక మార్పు చోటు చేసుకున్నది. గతంలో జగిత్యాల రూరల్‌లో ఎస్ఐగా పనిచేసిన ఏ అనిల్‌ను వెల్గటూర్ ఎస్ఐగా బదిలీ చేస్తూ ఆర్డర్ ఇచ్చారు. మెట్‌పల్లి సబ్ డివిజన్ పరిధిలోని ఇబ్రహీంపట్నం ఎస్ఐగా ఉమాసాగర్‌కు పోస్టింగ్ ఇచ్చారు. అయితే రెండు రోజుల వ్యవధిలోనే ఈ మార్పులు జరిగాయి. వెల్గటూర్ ఎస్ఐ అనిల్‌ను ఇబ్రహీంపట్నంకు, ఉమాసాగర్‌ను ఇబ్రహీంపట్నం నుంచి వెల్గటూర్‌కు బదిలీ చేయడం గమనార్హం. అందులో కొన్ని పోస్టుల్లో భారీగా డబ్బులు మారాయన్న ఆరోపణలున్నాయి.

### ఇతర శాఖల్లోనూ..

మంథని ఆర్డీవో కార్యాలయంలో ఏవోగా పనిచేస్తున్న తూము రవీందర్‌ను రెవెన్యూ బదిలీల్లో భాగంగా కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ చేశారు. అయితే ఓ నేత అండదండలతో తిరిగి మళ్లీ పూర్వ స్థానానికే పోస్టింగ్ తెచ్చుకున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక పెద్దపల్లి ఆర్టీవో కార్యాలయంలో డిప్యూటేషన్ మీద పనిచేస్తున్న ఆర్టీవో రంగరావు, రవాణాశాఖలో డిప్యూటేషన్లు రద్దు కావడంతో తిరిగి తన సొంత పోస్టింగ్ అయిన వరంగల్‌కు వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న ఆఫ్రిన్ సిద్ధిఖీ ఈ జిల్లాకు వచ్చారు. మళ్లీ పది రోజుల్లోనే ఆర్టీవో రంగారావు తిరిగి పెద్దపల్లి ఆర్టీవోగా రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. అలాగే అదే కార్యాలయంలో ఎనిమిదేళ్లుగా ఏంవీఐగా విధులు నిర్వర్తిస్తున్న అల్లె శ్రీనివాస్ బదిలీపై వెళ్లారు. ఇటీవలే బదిలీపై హుజూరాబాద్ నుంచి వచ్చిన ఎంవీఐ సిరాజ్ నెల తిరగకుండానే వెనక్కి వెళ్లిపోయారు. పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో సీ సెక్షన్ సూపరిండెంట్‌గా పనిచేస్తున్న బండి ప్రకాశ్ ఆసిఫాబాద్ జిల్లాకు బదిలీ అయ్యారు. తిరిగి వారం రోజుల్లోనే పెద్దపల్లి కలెక్టరేట్ కార్యాలయంలో సీ సెక్షన్‌కు వచ్చి బాధ్యతలు స్వీకరించారు. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా చేసిన బదిలీల్లో అంతా అయోమయం నెలకొన్నది. రాజకీయ నేతలు తమకు సహకరించే వారిని తెచ్చుకునేందుకు జోక్యం చేసుకోవడంతోనే ఎన్నడూ లేని విధంగా బదిలీలు గందరగోళంగా మారడానికి కారణమని ఆయా ప్రభుత్వ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# సంజయ్.. సర్పంచులు ఇప్పుడు గుర్తొచ్చారా..?

- పంచాయతీలను, స్థానిక ప్రజాప్రతినిధులను ఏనాడైనా పట్టించుకున్నవా..
- ఐదేళ్లలో ఏం అభివృద్ధి చేసినవో చెప్పు
- ఎన్నికల్లో లబ్ధి కోసమే లేఖలు
- కరీంనగర్, జగిత్యాల, హనుమకొండ బీఆర్‌ఎస్ జడ్పీ అధ్యక్షులు



మాట్లాడుతున్న హనుమకొండ జడ్పీ చైర్మన్ సుధీర్‌బాబు, చిత్రంలో కరీంనగర్, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్లు విజయ, వసంత

కార్పొరేషన్, ఫిబ్రవరి 21 : ఎంపీ బండి సంజయ్‌కు ఇన్నాళ్లు కనిపించని సర్పంచులు, ఇప్పుడు పార్లమెంట్ ఎన్నికలు వస్తున్నాయనగానే గుర్తొచ్చారా..? అని కరీంనగర్, జగిత్యాల, హనుమకొండ జడ్పీ అధ్యక్షులు కనుమల్ల విజయ, దావ వసంత, సుధీర్‌బాబు ప్రశ్నించారు. రాబోయే ఎన్నికల్లో మాజీ సర్పంచుల నుంచి మద్దతు పొందాలన్న కుట్రతోనే వారికి లేఖలు రాస్తున్నారని విమర్శించారు. ఎంపీగా ఐదేళ్లలో నియోజకవర్గానికి నిధులు తేలేని ఆయన, ఇప్పుడు ఇలాంటి కుయుక్తులు పన్నుతున్నారని దుయ్యబట్టారు. కరీంనగర్‌లోని ఓ ప్రైవేటు హోటల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గం గురించి ఏనాడూ పట్టించుకోని ఎంపీ ఉండడం బాధాకరమని ఎద్దేవా చేశారు. ఎంపీగా సంజయ్ ఏం అభివృద్ధి చేశారో.. మాజీ ఎంపీ వినోద్‌కుమార్ ఎంత అభివృద్ధి చేశారో అందరికీ తెలుసన్నారు. దీనిపై బహిరంగ చర్చకు సిద్ధం అని సవాల్ విసిరారు. వినోద్ కుమార్ జమ్మికుంట, ఉప్పల్, బిజిగిరిషరీఫ్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జిలు మంజూరు చేయించారని, కరీంనగర్‌కు స్మార్ట్‌సిటీ సాధించారని కొనియాడారు. సంజయ్ స్థానిక సంస్థల్లో అభివృద్ధిని ఏనాడూ పట్టించుకోలేదని, కనీసం సమావేశాలకు కూడా రాలేదని, ఇప్పుడు మాత్రం సర్పంచుల సానుభూతి పొందేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ పాలనలో పల్లె ప్రగతి ద్వారా ప్రతి నెలా పంచాయతీలకు నిధులు రావడంతోనే ఎంతో అభివృద్ధి సాధించాయని, దీనిని గుర్తించి కేంద్ర ప్రభుత్వం అనేక అవార్డులను ఇచ్చిందని గుర్తు చేశారు. ఇలాంటి సమయంలోనైనా సంజయ్ సర్పంచులను గుర్తించి అభినందనలు తెలిపారా..? అని ప్రశ్నించారు. గ్రామ పంచాయతీలకు కేంద్రం నుంచి నిధులు తెచ్చేందుకు ఏమైనా కృషి చేశారా? అని అడిగారు. ఉపాధి హామీ పథకం పని దినాలను తగ్గించింది కేంద్ర ప్రభుత్వం కాదా..? అని ప్రశ్నించారు. ఈ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని మేం డిమాండ్ చేస్తున్నా, ఫసల్ బీమా యోజనలో మండలాన్ని కాకుండా గ్రామాన్ని ఒక యూనిట్‌గా తీసుకోవాలంటున్నా ఎందుకు స్పందించలేదని నిలదీశారు. గ్రామ పంచాయితీలను, స్థానిక ప్రజాప్రతినిధులను ఏ రోజు కూడా పట్టించుకోని బండి సంజయ్ ఇప్పుడు వచ్చి ఎంతో పని చేశారంటూ లేఖలు రాయడం ఆశ్చర్యంగా ఉందన్నారు. కేవలం రాజకీయ లబ్ధికోసమే ఇలాంటి కార్యక్రమాలను చేపడుతున్నారని విమర్శించారు. ఇప్పటికైనా ఇలాంటి కుయుక్తులు మానుకొని, ఐదేళ్లలో నీవు చేసిన అభివృద్ధిని చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, నాయకులు ఇష్తికార్, ఉదారపు మారుతి తదితరులు పాల్గొన్నారు.



రేకుర్తి గద్దెల వద్ద సారలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

# గద్దెనెక్కిన సారలమ్మ

- ఘనంగా వనజాతర మొదలు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పోటెత్తిన భక్తులు
- మొదటి రోజే పెద్ద సంఖ్యలో భక్తుల దర్శనం
- నేడు కొలువుదీరనున్న తల్లి సమ్మక్క
- ఏర్పాట్లను పర్యవేక్షించిన యంత్రాంగం



సారలమ్మను గద్దెపై ప్రతిష్ఠిస్తున్న కోయ పూజారులు, భక్తులు

వన జాతరకు తెరలేచింది. డప్పుచప్పుళ్లు, ఒగ్గు కళాకారుల నృత్యాలు, శివసత్తుల పూనకాల నడుమ కుంకుమ భరిణె రూపంలో ఉన్న సారలమ్మ బుధవారం సాయంత్రం గద్దెనెక్కడంతో సందడి మొదలైంది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 60 చోట్లకు పైగా జాతరలు ఘనంగా ప్రారంభంకాగా, ప్రధానంగా రేకుర్తి, కేశవపట్నం, హుజూరాబాద్ శివారులోని రంగనాయకులగుట్ట, వీణవంక, గోదావరిఖని, గోలివాడ, నీరుకుల్ల, కొలనూర్, హన్మంతునిపేట, జాతర్లకు పోటెత్తారు. కాగా, మొదటి రోజు పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. నేడు తల్లి సమ్మక్క గద్దెలపైకి రానుండగా, జనం పోటెత్తనున్నారు. కాగా, కోనరావుపేట శివంగాళపల్లిలో విప్ ఆదిశ్రీనివాస్, రామగుండంలో ఎమ్మెల్యే మక్కాన్ సింగ్, చొప్పదండిలో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు.

- కరీంనగర్ కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 21

## కనులపండువలా వెంకన్న శోభాయాత్ర

కమాన్ చౌరస్తా, ఫిబ్రవరి 21: కరీంనగర్ మార్కెట్ రోడ్డు వేంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం నిర్వహించిన శోభాయాత్ర కనుల పండువలా సాగింది. అలంకరించిన గరుడ వాహనంతో కూడిన రథంపై శ్రీవారి ఉత్సవ మూ ర్తులను ఉంచి మార్క్‌ఫెడ్ గ్రౌండ్ నుంచి ప్రారంభమైన ఊరేగింపు రాంనగర్, మంకమ్మతోట, తెలంగాణచౌక్, బస్టాండ్, టూటౌన్ పోలీస్ స్టేషన్ గుండా ఆలయానికి చేరుకున్నది. శోభాయాత్రలో భక్తులు సాంస్కృతిక ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. మంత్రి పొన్నం ప్రభాకర్ శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కాగా, మంత్రి స్వయంగా శ్రీవారి వాహనాన్ని నడిపారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి వైద్యుల అంజన్‌కుమార్ పాల్గొన్నారు.



వాహనం నడుపుతున్న మంత్రి పొన్నం



నగరంలో స్వామివారి శోభాయాత్రలో భక్తులు